# సమస్యలు పరిష్కరించే వరకు.. సమ్మె

## ఉస్మానియా దవాఖానలో జూడాలు

సుల్తాన్ బజార్, జూన్ 25: జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమస్యలను పూర్తిగా పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని ఉస్మానియా జూడా అధ్యక్షుడు డాక్టర్ దీపాంకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చంద్రకారెడ్డిలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నిరవధిక సమ్మెలో రెండో రోజు ఉస్మానియా దవాఖానాలో ర్యాలీని నిర్వహించిన అనంతరం, సూపరింటెండెంట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సమ్మెలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో 'సీఎం రావాలి, ఉస్మానియాకు నూతన భవనం నిర్మించి మమల్ని బతికించాలి, ఉస్మానియాకు పాత భవనం వద్దు, నూతన భవనమే ముద్దు, టీ జూడాల అన్ని సమస్యలను పరిష్కరించాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొంత కాలంగా జూడాలు నిరసన కార్యక్రమాలు జరుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటి? అని వారు ప్రశ్నించారు. తమ రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల స్థలంలో హై కోర్టు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పేద రోగులు చికిత్సలు పొందే ఉస్మానియా దవాఖాన నూతన భవనం నిర్మాణం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని ఆరోపించారు. దేశంలోని కశ్మీర్, బీహార్, చత్తీస్‌గఢ్ వంటి దూర ప్రాంతాల నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాల్లో విద్యను అభ్యసించేందుకు వచ్చే వైద్య విద్యార్థులకు ఇక్కడి మెడికల్ కళాశాలలు, దవాఖానాలు వెక్కిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జూడాలు డాక్టర్లు ఇసాక్ న్యూటన్, రాహుల్, చంద్రకళ పాల్గొన్నారు.

## గాంధీలో కొనసాగుతున్న జూడాల సమ్మె

### విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శనలో జూనియర్ డాక్టర్లు

బన్సీలాల్‌పేట్, జూన్ 25: జూనియర్ డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని సమ్మె రెండో రోజైన మంగళవారం గాంధీ దవాఖానలో జూడాలు విధులను బహిష్కరించి, నిరసన ప్రదర్శన నిర్వహించారు. దవాఖాన ప్రధాన భవనం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేసేంత వరకు నిరవధికంగా సమ్మె చేస్తామని జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సాయి హర్ష, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణలు తెలిపారు. అత్యవసర వైద్య సేవలు, ఐసీయూలను మినహాయించి, మిగతా అన్ని విభాగాలను తాము బహిష్కరించామని చెప్పారు. వైద్య విద్యార్థులమైన తమకు ఉద్యమాలు చేయాలన్నది లక్ష్యం కాదని, ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.

## ఆవిష్కరణలకు ఆర్థిక ప్రోత్సాహం..

### నేడు ఫెలోషిప్‌పై సీసీఎంబీ-ఏఐసీ అవగాహన సదస్సు

సిటీబ్యూరో, జూన్ 25(నమస్తే తెలంగాణ): లైఫ్ సైన్సెస్ రంగంలో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా బ్లాక్ చైన్ ఫర్ ఇంపాక్ట్ సంస్థ రీసెర్చ్ ఫెలోషిప్‌ను ప్రకటించింది. ఆలోచనలను ఆవిష్కరణలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులను ఆరునెలలపాటు అందించనుంది. అదేవిధంగా ప్రతి నెల రూ. 50వేల చొప్పున ఆరునెలల పాటు ఫెలోషిప్‌ను బీఎఫ్ఐ అందించనుంది. జులై 10లోపు దరఖాస్తు చేసుకుంటే... స్క్రీనింగ్ తర్వాత ఆర్థిక ప్రోత్సాహాలను కల్పించనుంది. అయితే విద్యార్థులు ఈ ఫెలోషిప్‌కు ఎంపికయ్యేందుకు బుధవారం సాయంత్రం 3గంటలకు సీసీఎంబీ-ఏఐసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగంలో ఔత్సాహికవేత్తలను తీర్చిదిద్దేందుకు పెరుగుతున్న డిమాండ్ ఉంది. ఈ క్రమంలో విద్యార్థి దశ నుంచి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఆలోచనలను ఆవిష్కరణలుగా డెవలప్ చేసేందుకు ఈ ఫెలోషిప్ సహకరిస్తుందని చెబుతున్నారు.

## పాత బస్సుపాస్ చూపిస్తే.. కొత్తది జారీ

### 27 నుంచి జర్నలిస్టులు కౌంటర్ల వద్ద బస్సు పాసులు

### ఆర్టీసీ ఏటీఎం మహేశ్

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డు గడువు ముగుస్తుండటంతో బస్సు పాస్ గడువు కూడా సమీపించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మరో మూడు నెలలు అక్రిడిటేషన్ గడువు పొడిగించిన విషయం తెలిసిందే. దీంతో బస్సు పాస్ జారీ కూడా మరో మూడు నెలల పాటు ఉండనుంది. ఐతే ఇందుకోసం పాత విధానంలో ఆన్‌లైన్ లింక్‌లో వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం) మహేశ్ కుమార్ మంగళవారం 'నమస్తే తెలంగాణ'తో తెలిపారు. పాత బస్సు పాస్‌ను ఈ నెల 27 నుంచి నగరంలోని బస్సు పాస్ కౌంటర్ల వద్ద చూపించి కొత్త బస్సు పాస్ పొందొచ్చని చెప్పారు. జర్నలిస్టుల సౌలభ్యం దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ఈ విధానం అమలు చేస్తున్నామన్నారు. కాగా, ఆన్‌లైన్ విధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

## 9న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

### ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం - పోస్టర్ విడుదల

అమీర్‌పేట్, జూన్ 25: ఎల్లమ్మ కల్యాణోత్సవ ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం బల్కంపేట దేవాలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. కాగా, సమావేశం పేలవంగా సాగింది. వచ్చే నెల తొమ్మిదన ప్రతిష్ఠాత్మకంగా జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఇదిలా ఉంటే మంగళవారం దేవాలయ ఆవరణలో కల్యాణ ఏర్పాట్ల సమీక్షలో మంత్రి పొన్నం సహా జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ము ఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, దేవాదా య కమిషనర్ ఎం.హనుమంతారావు, అదనపు కమిషనర్ కృష్ణవేణి, దేవాలయ ఛైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్, అమీర్‌పేట్ కార్పొరేటర్ కేతినేని సరళ, జీహెచ్ఎంసీ ఖైతరాబాద్ జెడ్సీ అనురాగ్ జయంతి, పశ్చిమ మండలం డీసీ పీ విజయ్ కుమార్, జల మండలి సీజీఎం ప్రభులతో పాటు ఆర్ అండ్ బీ, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, సాంస్కృతిక విభాగాల అధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ, బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్లను వెచ్చిస్తోందని, బోనాలను ఘనంగా నిర్వహించేందుకు జరుగుతున్న సన్నాహాల్లో భాగంగా నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## డీఆర్టీ లైబ్రరీని ప్రారంభించిన హైకోర్టు మెజిస్ట్రేట్



సిటీబ్యూరో, జూన్ 25(నమస్తే తెలంగాణ): డీఆర్టీ (డెబిట్స్ రికవరీ ట్రిబ్యునల్) అడ్వకేట్ అసోసియేషన్ లైబ్రరీని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మి నారాయణ అలిశెట్టి ప్రారంభించారు. డీఆర్‌టీ-1 ప్రిసైడింగ్ అధికారి గుమ్మడి గోపీచంద్, డీఆర్‌టీ 2-ప్రిసైడింగ్ అధికారి రామేశ్వర్ గంగారామ్ కోతెతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం, నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి మాట్లాడుతూ, లాయర్లకు లైబ్రరీ చాలా విలువైనదని తెలిపారు. లైబ్రరీ ఏర్పాటులో అందరూ చూపిన కృషి చాలా గొప్పదని అభివర్ణించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ జీకే దేశ్‌పాండే, వైస్ ప్రెసిడెంట్ ఎన్వీ సుబ్బరాజు, జనరల్ సెక్రటరీ డి.రాఘవులు, జాయింట్ సెక్రటరీ కె.కల్యాణ్ చక్రవర్తి, ట్రెజరర్ అదిరన్ కిరణ్ రాజ్, స్పోర్ట్స్ అండ్‌కల్చర్ సెక్రెటరీ సీహెచ్ కిషోర్, లైబ్రేరియన్ టి.రణ్‌ధీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏ.నరేష్, జే.నరేంద్ర కుమార్, శ్రావణ్ కుమార్ రాగి, జి.పుష్కల, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంచాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రేరీ ఎదుట నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్, లెనిన్‌లతో కలిసి సత్య మాట్లాడారు. ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేసి, జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు నియమిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. జీవో నం.46, జీవో నం. 317లకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగుల సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భగత్, రమేశ్, మధు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య

## నిరుద్యోగుల డిమాండ్ల సాధనే ధ్యేయంగా నిరాహార దీక్ష

గాంధీ ఆస్పత్రిలో బెడ్‌పై దీక్షను కొనసాగిస్తున్న మోతీలాల్ నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25: నిరుద్యోగుల డిమాండ్ల సాధనే లక్ష్యంగా నిరుద్యోగ, విద్యార్థి జేఏసీ చైర్మన్, ఓయూ జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్ చేస్తున్న దీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందని మోతీలాల్ నాయక్ ఉస్మానియా యూనివర్సిటీలో సోమవారం నిరాహార దీక్షకు దిగగా, పోలీసులు అదుపులోకి తీసుకుని, ఓయూ పీఎస్‌కు తరలించారు. మోతీలాల్ పోలీస్ స్టేషన్‌లో దీక్ష కొనసాగిస్తుండటంతో పోలీసులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బెడ్‌పై పడుకుని చికిత్స తీసుకుంటున్నప్పటికీ ఆయన దీక్షను కొనసాగిస్తుండటం గమనార్హం.

## జీహెచ్ఎంసీ ఆస్తులను డిజిటలైజ్ చేయాలి

### స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడండి

### సమీక్షలో అధికారులకు మేయర్ ఆదేశాలు

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి, చిత్రంలో ఏసీ శ్రీవాత్సవ

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆస్తులను డిజిటలైజేషన్ చేయాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. మేయర్ ఛాంబర్‌లో ఎస్టేట్ అదనపు కమిషనర్లతో కలిసి మేయర్ మంగళవారం సమీక్షించారు. జీహెచ్ఎంసీ ఆస్తుల ద్వారా ఆదాయ వనరులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మేయర్ అన్నారు. ఓపెన్ స్థలాలు ఎన్ని ఉన్నాయి? అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తులను కేటగిరిగా చేసి వాటి వివరాలు అందజేయాలని కోరారు. నెలవారీ అద్దెలు సక్రమంగా వసూలు అవుతున్నాయా? లీజ్ గడువు ముగింపు అయినట్లుగా ముందస్తుగా సంకేతాలు వచ్చే విధంగా ఆన్‌లైన్‌లో సరి చేయాలన్నారు. కమ్యూనిటీ భవనాలు ఎన్ని ఉన్నాయి? వాటిని దేనికి ఉపయోగిస్తున్నారో.. వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని మేయర్ చెప్పారు. మోడల్ మార్కెట్, మున్సిపల్ మార్కెట్ గదుల వివరాలు, వినియోగిస్తున్న వాటి వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. లీజు వివరాలు, ఆస్తులు అన్నింటినీ సిద్ధం చేసుకొని మరోసారి జరిగే సమావేశం వరకు పూర్తి నివేదికతో హాజరు కావాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలపై హింసాకాండను ఆపాలి

సమావేశంలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ సంధ్య..

చిక్కడపల్లి, జూన్ 25 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో కేంద్ర బలగాలు ఆదివాసీ మహిళలపై చేస్తున్న అకృత్యాలను పలువురు తీవ్రంగా ఖండించారు. ఆపరేషన్ కగాన్ పేరుతో అమలు చేస్తున్న హింసాకాండను వెంటనే ఆపాలి వారు డిమాండ్ చేశారు. చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రతినిధి సృజన, ప్రొఫెసర్ వనసమాల, పీఓడబ్ల్యూ నాయకురాలు ఝాన్సీ, మహిళా ట్రాన్స్‌జెండర్ జేఏసీ నేత సజయ, రచయిత్రులు భం డారి విజయలక్ష్మి, శివలక్ష్మి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, ఛత్తీస్‌గఢ్, నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులను నిర్మూలించే నెపం తో ఆపరేషన్ కగార్‌ను చేపట్టి, బీజేపీ ప్రభు త్వం కేంద్ర బలగాల క్యాంపులను ఏర్పాటు చేసిందన్నారు. ఆదివాసీ గూడాలను చుట్టుముట్టి అమాయక మహిళలను హింసిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, నిరాయుధులైన పురుషులు, మహిళలను ఎన్‌కౌంటర్ పేరుతో చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఆదివాసీ హక్కులను, జీవించే హక్కులను, లైంగిక వ్యతిరేక చట్టాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో జర్నలిస్టు వంగపల్లి పద్మ, చైతన్య మహిళా సంఘం అరుణ, రాష్ట్ర కో కన్వీనర్ శ్రీదేవి, అనిత, కళ, అలివేలు, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలి

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య

విలేకరుల సమావేశం అనంతరం నినదిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25: నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసి, రాష్ట్రాల వారీగా తిరిగి నిర్వహించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య డిమాండ్ చేశారు. పరీక్షలు పారదర్శకంగా జరగాలంటే రాష్ట్రాల వారీగా నిర్వహించడమే మేలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో వివిధ పోటీ పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టీఏ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తక్షణమే ఎన్‌టీఏను రద్దు చేసి, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పరీక్షను తిరిగి నిర్వహించి, సాధారణ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రాజెక్టుల పురోగతిపై హెచ్ఎండీఏ కమిషనర్ సమీక్ష

సిటీబ్యూరో, జూన్ 25(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన సర్ఫరాజ్ అహ్మద్ ఇంజనీరింగ్ ప్రాజెక్టులపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో కీలకమైన మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత నగరంలో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి హెచ్ఎండీఏ నిర్మించే ప్రాజెక్టుపై హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) పరంజ్యోతి, కన్సల్టెన్సీ ప్రతినిధులతో మాట్లాడారు. ప్రాజెక్టు ప్రాధాన్యతను, దాని డిజైన్‌తో పాటు అంచనా వ్యయాన్ని అధికారులు కమిషనర్‌కు వివరించారు. జూ పార్కును ఆనుకొని ఉన్న మీరాలం చెరువు మీదుగా 2.5 కి.మీ మేర నిర్మించే హై లెవల్ బ్రిడ్జి బెంగళూరు జాతీయ రహదారి నుంచి అత్తాపూర్ వైపు చింతల్‌కుంట రోడ్డుకు అనుసంధానం చేసేలా నిర్మాణం ఉంటుందని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మీరాలం ట్యాంక్ మీదుగా ఈ హై లెవల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉంచామని, ఇందుకు సుమారు రూ.363 కోట్లతో మీరాలం చెరువు హై లెవల్ బ్రిడ్జిని నాలుగు వరుసలతో నిర్మించేలా డిజైన్ చేశామని తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పరిపాలన అనుమతులను జారీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ జీవో ఆర్‌టీ నం.120ని జారీ చేసిందని వివరించారు. మీరాలం చెరువు మీదుగా మెహిదీపట్నం, అత్తాపూర్ వైపున్న ఇన్నర్ రింగు రోడ్డుతో అనుసంధానం అయ్యేలా మీరాలం ట్యాంక్ మీదుగా అత్యాధునిక శైలిలో, నగరానికి మరింత వన్నె తెచ్చేలా హై లెవల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని కమిషనర్‌కు డిజైన్లతో కూడిన మ్యాప్‌తో వివరించారు.

### ఎలివేటర్ కారిడార్‌పైనా సమీక్ష..

హెచ్ఎండీఏ నగరంలో చేపడుతున్న అత్యంత కీలకమైన ప్రాజెక్టులో రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనా మెట్రోపాలిటన్ కమిషనర్ ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులతో సమీక్షించారు. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నుంచి తూంకుట వరకు రాజీవ్ రహదారిపై, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి మిలటరీ డైరీ ఫాం వరకు నిర్మించే రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం అవసరమైన స్థలాలను గుర్తించడంతో పాటు మార్కింగ్ పనులను పూర్తి చేశామని అధికారులు తెలిపారు. రెండు ఎలివేటెడ్ కారిడార్లలో రక్షణ శాఖకు చెందిన భూములు ఉండటంతో వాటిని వేర్వేరుగా గుర్తించామని, మిగతా భూములు ప్రజలకు చెందిన వాటిని గుర్తించామన్నారు. ఈ రెండు కారిడార్లలో కలిసి మొత్తం రూ.2300 కోట్ల వరకు ఆస్తుల సేకరణకే వ్యయం అవుతుందని కమిషనర్‌కు వివరించారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 25 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు పంచాయతీ కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. జిల్లాలోని పలు గ్రామాల్లో కొన్ని నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. జీఓ నంబర్ 51ను సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, కారోబార్, బిల్‌కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, నాయకులు సుధాకర్, సుగుణ, ఆరోగ్యం, లక్ష్మయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై ప్రధాని మోడీ స్పష్టత ఇవ్వాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

వీపీ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు

కవాడిగూడ, జూన్ 25: ప్రస్తుతం జరుగుతున్నటువంటి పార్లమెంట్ సమావేశాల్లో దేశంలో సామాజిక రిజర్వేషన్లపై ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్‌లో స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో అఖిల పక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడారు. మాజీ ప్రధాని వీపీ సింగ్ 93వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో ఏ ప్రభుత్వం వచ్చినా, ఎవరూ ప్రధానమంత్రి అయినా బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. మొట్టమొదటి సారిగా ఓబీసీలకు సంక్షేమం కోసం మండల్ కమిషన్ దుమ్ము దులిపి 1992లో అప్పటి ప్రధాని దివంగత వీపీ సింగ్ ఉద్యోగ రంగంలో ఓబీసీలకు మొదటి సారిగా 27 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వారికే దక్కిందన్నారు. అగ్రవర్ణ ప్రధానిగా ఉన్న వీపీ సింగ్ ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే, ఓబీసీ అని చెప్పుకుంటున్న మోడీ మాత్రం రాజ్యాంగానికి వ్యతిరేకంగా అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి బీసీల నోట్లో మట్టికొట్టారన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోతే దేశ వ్యాప్తంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు మరో మహా మండల్ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయ భాస్కర్, బీసీ నేతలు బూడిద మల్లికార్జున్ యాదవ్, పానుగంటి విజయ్, మాదేశి రాజేందర్, వీరమల్ల కార్తిక్, ప్రవీణ్ యాదవ్, జాజుల భాస్కర్, మహేందర్ పాల్గొన్నారు.

## బీసీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలి..

### నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం కేటాయించాలి.. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, చిత్రంలో గుజ్జకృష్ణ, చీలంపల్లి రమేశ్‌కుమార్, తదితరులు

రవీంద్రభారతి, జూన్ 25: త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలని, అదే విధంగా నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం బీసీలకు కేటాయించాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గతంలో జరిగిన మంత్రివర్గంలో బీసీలకు కేవలం రెండు మంత్రి పదవులు ఇచ్చి అన్యాయం చేశారని, త్వరలో జరగబోయే విస్తరణలో ఐదు మందికి అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బీసీలకు జనాభా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని దేశవ్యాప్తంగా బహిరంగ సభల్లో ప్రసంగిస్తుంటే ..ఇక్కడ బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా బీసీ కులాల్లో అత్యధిక జనాభా కలిగిన కురుమ, గొల్లలు, ముదిరాజ్, మున్నూరు కాపులు, విశ్వ బ్రాహ్మణ, రజక, నాయి, నాయిబ్రాహ్మణ, వడ్డెర, బలిజ కులాలకు ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. త్వరలో చేపట్టే నామినేటెడ్ పదవుల పంపకంలో బీసీలకు 50 శాతం కేటాయించాలని, ఈ సంవత్సరం 100 బీసీ గురుకుల పాఠశాలలు, 50 ఇంజినీరింగ్ కళాశాలలు, రెండు యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని, కళాశాలల్లో విద్యనభ్యసించే బీసీ విద్యార్థులకు పూర్తిగా ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర నాయకులు చీలంపల్లి రమేశ్‌కుమార్, టి నందగోపాల్, వేముల రామకృష్ణ, కోటేశ్వరి, మేడి రాందేవ్, అమృత, ఉమా, చిరంజీవి గౌడ్, అశీశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సమయ పాలన.. మెరుగైన వైద్యసేవలు

### అమీర్‌పేట్ ప్రభుత్వ దవాఖానలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

సిటీబ్యూరో, జూన్ 25(నమస్తే తెలంగాణ): వైద్యులంతా సమయంలోపే విధుల్లో ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రోగులకు నాణ్యమైన సేవలందించేలా వైద్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని, ప్రసవాల సంఖ్య పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ సేవలను నమోదు చేయాలని, ఆరోగ్యశ్రీ కిట్లను అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని చెప్పారు. అనంతరం, ఆసుపత్రిలోని అన్ని వార్డులను, ఓపీ, ఐసీయూ, మెటర్నిటీ, భోజనశాల వార్డులు, టాయిలెట్, ఆక్సిజన్ యూనిట్, క్యాంటీన్‌లను పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులు, బాలింతలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.